

బీఆర్‌ఎస్‌లో అలజడి

హైకోర్టు తీర్పు జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. 'గూడెం' టికెట్ ఆశిస్తున్న నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. 8లో



బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓసీ ప్రాజెక్టులలో డంపర్లు, డోజర్లు నిలిచిపోయాయి. 10లో

గరిష్ఠం / కనిష్ఠం

27° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం రోజంతా వర్షం కురిసే అవకాశం ఉన్నది. ఉదయం కొన్నిచోట్ల భారీ వర్షం కురవవచ్చు.

ఉధృత గోదావరి హై అలర్ట్



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి పరవళ్లు

- రాత్రి 12 గంటలకు 48.80 అడుగులకు చేరిన నీటిమట్టం
- వారం రోజుల్లో మూడుసార్లు మొదటి ప్రమాద హెచ్చరిక..
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ప్రత్యేకాధికారి అనుదీప్

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. రెండు రోజులుగా కొద్ది మేర హెచ్చు తగ్గులతో స్థిరంగా ఉంది. మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షాలతో ఎగువన ఉన్న ప్రాజెక్టులు, చర్లలోని తాలిపేరు నుంచి గోదావరిలోకి వరద నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం 5 గంటలకు 39.2 అడుగులుగా ఉన్న నీటిమట్టం, మధ్యాహ్నం 12 గంటలకు 41.80, 2 గంటలకు 43.50 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సాయంత్రం 4 గంటలకు 44.90, రాత్రి 9:28 గంటలకు 48 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 12 గంటలకు 48.8 అడుగులుగా నమోదుకాగా, 11,82,547 క్యూసెక్కుల ప్రవాహం దిగువకు వెళ్తోంది.

వారంలో మూడుసార్లు..

భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులు వస్తే మొదటి, 48 అడుగులకు రెండో, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఈ నెలలో వారం రోజుల వ్యవధిలోనే అధికారులు మూడుసార్లు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. తొలుత ఈ నెల 20న ఉదయం 43.30 అడుగులు రావడంతో తొలిసారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 21న 43.90 అడుగులకు పెరిగి అనంతరం క్రమేపీ తగ్గింది. ఆ తర్వాత తగ్గినట్టే తగ్గి 23న ఉదయం 43.10 అడుగులకు చేరి మళ్లీ తగ్గింది. తిరిగి బుధవారం వేగంగా పెరిగిన గోదావరి సాయంత్రం 4 గంటలకు 43.5 అడుగులకు చేరుకోవడంతో మూడోసారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

ఇంకా పెరగొచ్చని అధికారుల అంచనా..

కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువన ఉన్న ప్రాజెక్టుల వద్ద నుంచి వరద నీటిని గోదావరిలోకి వదులుతుండటంతో నది నీటిమట్టం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడిగడ్డ, సమ్మక్క సారక్క ప్రాజెక్టుల నుంచి వస్తున్న నీటికి తోడు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరికి దిగువన ఉన్న ఉపనది శబరికు వరద పోటెత్తుతోంది. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతుండటంతో గోదావరి నీటి ప్రవాహం ఇంకా పెరగొచ్చని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

మళ్లీ నీటమునిగిన విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, కరకట్ట వద్ద నున్న స్లూయిజ్‌లను మూసివేయడంతో రామాలయం చెంత విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రం చుట్టూ నీరు చేరుకుంది. అన్నదాన సత్రంలోకి సైతం నీరు ప్రవేశించింది. దీంతో అధికారులు స్లూయిజ్‌ల వద్ద నున్న మోటార్లతో వరద నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు. ఇందుకు 1,550 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న 16 మోటార్లను వినియోగిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే రెండు సార్లు విస్తా కాంప్లెక్స్‌లోని దుకాణాలను వరద నీరు ముంచెత్తటంతో చిరు వ్యాపారులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



వరద నీటితో ముంపునకు గురైన విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదానసత్రం

వరద ముంపును తక్కువ అంచనా వేయొద్దు : పొదెం



కరకట్టపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి వరద ముంపును తక్కువగా అంచనా వేయొద్దని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య హెచ్చరించారు. భారీ వర్షంలోనే గోదావరి వరద ఉధృతిని బుధవారం ఆయన పరిశీలించారు. స్లూయిజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేసే విధంగా ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఇతర శాఖల అధికారులు డివిజన్, మండల కేంద్రాల్లోనే ఉండాలని తెలిపారు.

ఏజెన్సీలో పర్యటించిన ప్రత్యేకాధికారి అనుదీప్

గోదావరి వరదలకు ప్రత్యేకాధికారిగా నియమించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ భద్రాచలం ఏజెన్సీలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. తాలిపేరు ప్రాజెక్టు ఉధృతిని, విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిజ్ ప్రాంతాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. నన్నపునేని మోహన్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. తాలిపేరు ప్రాజెక్టును వరద నీరు చేరుతున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, చర్ల, భద్రాచలం తహసీల్దార్లు భరణి, రామకృష్ణ పాల్గొన్నారు. కాగా కరకట్టపై, ముంపు తీర ప్రాంతాల్లో, వాగులు, చెరువుల వద్ద తిరగొద్దని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో కోరారు. జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.



పునరావాస శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి



గుండాల: ఆళ్లపల్లి మండలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న జల్లేరువాగు

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు
- కరకగూడెంలో 22 సెం.మీ వర్షపాతం
- తాలిపేరు ఉగ్రరూపం, గోదావరికి వరద పోటు
- భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ములకలపల్లి వద్ద పాములేరు వాగులో ఒకరు గల్లంతు
- రెస్క్యూ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసిన పోలీస్‌శాఖ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వర్షాలు, వరదలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రభుత్వ సిబ్బంది పని చేసే కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశించారు. రానున్న రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో గోదావరి వరద పరిస్థితిపై భద్రాచలం ఆర్డీఓ కార్యాలయం నుంచి రాత్రి రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, రహదారులు భవనాలు, మిషన్ భగీరథ, విద్యుత్, వైద్య, సెక్టోరియల్, మండల ప్రత్యేక అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లా ఆరెంజ్ జోన్‌లో ఉందని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు హై అలర్ట్‌గా ఉండాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన టీములు, ప్రత్యేక అధికారులు, సెక్టోరియల్ అధికారులు కేటాయించిన మండలాల్లో వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని వివరించారు. సమస్యాత్మక, ముంపునకు గురయ్యే ప్రాంతాల సమగ్ర జాబితా సిద్ధంగా ఉండాలని, చెరువుల పరిరక్షణ చర్యలు చేపట్టాలని, ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. రోడ్ల పైకి నీరు చేరిన ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రించాలని చెప్పారు.

మండలస్థాయి బృందాలు అప్రమత్తంగా ఉండాలి

శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, నీట మునిగే ప్రాంతాల్లో ప్రయాణాలు చేయకుండా ట్రాక్టర్లు అడ్డుగా పెట్టాలని వివరించారు. ములకలపల్లిలో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. మండల స్థాయి బృందాలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడా విద్యుత్ సమస్య రావొద్దని, ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కరించాలని, తాగునీటి సమస్య వచ్చిన ప్రాంతాల్లో పంచాయతీ, రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి పరీక్షలు చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లకుండా చూడాలన్నారు. రెండు రోజులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, నీళ్లు నిలిచే ప్రాంతాల్లో రవాణా సేవలు నిలిపి వేసేందుకు పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, మధుసూదన్ రాజు, ఇతర అధికారులు భీమ్లా, డాక్టర్ శిరీష, డాక్టర్ రవిబాబు, మరియన్న, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు

బుధవారం జిల్లాలో ఒక్క దమ్మపేట మండలం మినహా జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. కరకగూడెం మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 22 సెంటీమీటర్ల అతి భారీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత భారీ వర్షపాతం నమోదైన మండలాల్లో చర్ల, పినపాక, సుజాతనగర్, ఇల్లెందు, కొత్తగూడెం మండలాలు ఉన్నాయి. మిగిలిన మండలాల్లోనూ భారీగానే వానలు పడ్డాయి.

రెండో ప్రమాద హెచ్చరిక

బుధవారం ఉదయం నుంచి తాలిపేరు ఉగ్రరూపం దాల్చింది. ఎగువన ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షాలతో దాదాపు రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రాజెక్టుకు చేరింది. దీంతో ప్రాజెక్టు గేట్లన్నింటినీ ఎత్తి కిందకు వదులుతున్నారు. మరోవైపు ఎగువన ప్రాణహిత, ఇంద్రావతి వరదకు తాలిపేరు కూడా జతవ్వడంతో భద్రాచలం వద్ద గోదావరి వరద ఉగ్రరూపం దాల్చింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 48 అడుగులకు వరద రాలేదు. కానీ బుధవారం రాత్రి రెండో ప్రమాద హెచ్చరికను దాటుకుని 49 అడుగుల పైకి వరద చేరుకుంది. దీంతో ముందు జాగ్రత్తగా భద్రాచలంలోని కొత్తకాలనీ, చర్ల మండల దండుపేట, రాళ్లగూడెం లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఐఏఎస్ అధికారి అనుదీప్ భద్రాచలం కేంద్రంగా వరద సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

ఆపదలో ఉంటే..

ఆపదలో ఉన్నవారు తమ ఫొటోలు, వాట్సాప్ లొకేషన్, పంపి పోలీసుల సేవలు పొందాలని ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు. జిల్లా పోలీస్ రెస్క్యూ కంట్రోల్ వాట్సాప్ నంబర్ 87126 82128కు ఫోన్ చేసి సహాయం పొందాలని విజ్ఞప్తి చేశారు. కంట్రోల్ రూమ్ సేవలు 24/7 అందుబాటులో ఉంటాయన్నారు.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి ఉత్సవమూర్తులకు బుధవారం ఆలయ అర్చకులు స్నపన తిరుమంజనం కమనీయంగా జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

ఎస్పీ డాక్టర్ వినీత్



ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవద్దని సూచించారు. చెట్లకింద, శిథిలమైన భవనాల కింద, పాడైన భవనాల్లో ఉండొద్దని తెలిపారు.

విధులకు వెళ్లొస్తుండగా అడ్డొచ్చిన వాగు



మర్రిగూడెం వాగు దాటుతున్న ఏఎన్‌ఎం దేవి, ఆశ కార్యకర్త జయ

చుంచుపల్లి: చుంచుపల్లి మండలం పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గొత్తికోయ గ్రామమైన మర్రిగూడెంలో బుధవారం చిన్నపిల్లలు, బాలింతలకు వైద్యసిబ్బంది టీకాలు వేశారు. ఆ తర్వాత తిరిగి వస్తుండగా మర్రిగూడెం వాగులో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో ఏఎన్ఎం దేవి, ఆశా కార్యకర్త జయ అలాగే వాగు దాటుతూ ఇటువైపు ఒడ్డుకు చేరారు. వాగు దాటి వెళ్లి విధులు నిర్వర్తించి ప్రాణాలు తెగించి బయటకు వచ్చిన సిబ్బందిని పలువురు అభినందించారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ (సీసీసీ)లో ఉన్న సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జీఎం హెచ్‌ఆర్‌డీ బి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన సింగరేణి కార్మికుల, రిటైర్డ్ కార్మికుల పిల్లలు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 94911 44168 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి ఇ.సోమశేఖరశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు సంబంధిత పత్రాలను మండల విద్యాధికారులతో ధ్రువీకరించుకుని ఈ నెల 31వ తేదీ లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

నేడు సదరం క్యాంపు

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం గురువారం కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు డీఆర్డీఓ జి.మధుసూదన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 కూడా మరో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ఆధారాలతో ఈ క్యాంపులకు హాజరుకావాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) భరతేష్‌కుమార్ జైన్ బుధవారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల డీఆర్‌ఎం బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి కొత్తగూడెం వచ్చారు. తొలుత మణుగూరు, పాల్వంచ కేటీపీఎస్, రుద్రంపూర్‌ల్లోని బొగ్గు లోడింగ్ పాయింట్లను పరిశీలించారు. ఆతర్వాత కొత్తగూడెం చేరుకున్న డీఆర్‌ఎం ఇక్కడి వసతులు, సమస్యలపై ఆరా తీశారు. కాగా, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు డీఆర్‌ఎంను సన్మానించిపలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

ఆర్‌సీహెచ్‌పీని సందర్శించిన డీఆర్‌ఎం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)ను డీఆర్‌ఎం భరతేష్‌కుమార్ జైన్ బుధవారం తనిఖీ చేశారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆయనకు స్వాగతం పలకగా.. ఆర్‌సీహెచ్‌పీ నుండి రోజుకు ఎన్ని వ్యాగన్ల బొగ్గు రవాణా అవుతోందనే వివరాలను డీవైఎస్‌ఈ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత ప్రీ వేబిన్ వద్ద వెళ్లి తనిఖీ చేశారు. అధికారులు కోటిరెడ్డి, వై.రఘురామిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, రామకృష్ణ, విశ్వేశ్వరరావు, అజ్మీరా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేసిన ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్ అప్రమత్తమయ్యారు. బుధవారం రాత్రి భద్రాచలంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. రెండు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అన్ని వేళలా సాయంగా ఉండేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

లాక్‌డౌన్‌లా భావించండి

జిల్లాలో వరదలతో ఏడు మార్గాల్లో రాకపోకలు ఆగిపోయాయని, ఇంకో పదిహేను వరకు రోడ్డు మార్గాలు మూసుకుపోయే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. రెండు వేల చెరువులు ఉండగా, 1,030 చెరువులు అలుగు పోస్తున్నాయని తెలిపారు. గురు, శుక్రవారాల్లో ఇంకో 500 చెరువులు మత్తడి పోసే అవకాశం ఉందని పేర్కొన్నారు. చెరువులు నిండటంతో నీరంతా వాగుల్లోకి వస్తోందని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశామని చెప్పారు. 23 మండలాల ప్రజలు మెడికల్ ఎమర్జెన్సీ వంటి అత్యవసరం ఉంటేనే బయటకు రావాలని, వర్షాల నేపథ్యంలో ప్రతీ గ్రామానికి ఏఎన్‌ఎం, పంచాయతీ సెక్రటరీలతో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతీ మండలానికి కాల్ సెంటర్ అందుబాటులోకి తెచ్చామని, అవసరమైతే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సాయం తీసుకోవాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక, పక్కన ఎస్పీ వినీత్

రెండు రోజులు రెడ్ అలర్ట్

అత్యంత భారీ వర్షాల కారణంగా జిల్లాలో రెండు రోజులు రెడ్ అలర్ట్ ఉంటుందని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. భారీ వర్షాలు కురిసిన కరకగూడెం, దుమ్ముగూడెం మండలాలకు ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రత్యేక బృందాలను పంపించామని, చర్లలో నలభై కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామని వివరించారు. ముంపు ప్రభావం ఉండే పద్నాలుగు గ్రామాల ప్రజలకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నామని, బుధవారం రాత్రికే ఎనిమిది గ్రామాలను ఖాళీ చేయిస్తున్నామని తెలిపారు.

కిన్నెరసాని పరవళ్లు



ప్రాజెక్ట్ 12 గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కిన్నెరసాని నది పరవళ్లు తొక్కుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువన నుంచి 82 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, బుధవారం రాత్రి 10:30 గంటలకు రిజర్వాయర్ నీటిమట్టం 404.70 అడుగులకు పెరిగింది. ప్రాజెక్ట్‌కు మొత్తం 13 గేట్లు ఉండగా, 12 గేట్లు ఎత్తి 90 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీరు సురేష్ తెలిపారు. గురువారమూ ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు.

తాలిపేరు ఉరకలు



తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి వదులుతున్న వరద

చర్ల: ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనూ కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తుతోంది. బుధవారం 25 గేట్లు ఎత్తి 1,98,592 క్యూసెక్కుల వరదనీటిని ప్రాజెక్ట్ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో తాలిపేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. గోదావరి బ్యాక్ వాటర్ కూడా వాగులోకి రావడంతో దండుపేట, గుంపెన్నగూడెం, ఆంజనేయపురం, తేగడ గ్రామాల శివారులోకి వరద నీరు చేరింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా ప్రస్తుతం 73.50 మీటర్లకు చేరుకుంది. ఈఈ హెచ్ రాంప్రసాద్, డీఈ తిరుపతి, ఏఈలు ఉపేంద్ర, శ్రీనివాస్ తదితరులు ప్రాజెక్ట్ వద్దనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రత్యేకాధికారి అనుదీప్, కలెక్టర్ ప్రియాంక అలా బుధవారం తాలిపేరు ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ తాలిపేరు హైలెవల్ వంతెన వద్ద వరద పరిస్థితిని, దండుపేట, వీరాపురం, చీమలపాడు, సుబ్బంపేట తదితర గ్రామాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, తహసీల్దార్ భరణిబాబు, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.



తేగడలో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వరద పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక

క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తే తొలిమెట్టు కార్యక్రమం విజయవంతం అవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ పేర్కొన్నారు. మూడు రోజులనుంచి కొత్తగూడెంలోని ఆనందఖని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి రిసోర్స్ పర్సన్ల శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది జిల్లాలో తొలిమెట్టు దాదాపు 80 శాతం విజయ వంతమైందని, ఈ సంవత్సరం వినూత్నంగా ఉపాధ్యాయ కరదీపికలు, విద్యార్థులకు వర్క్ బుక్స్ అందించడం ద్వారా ఉపాధ్యాయుల పని ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను మండల స్థాయిలో జరిగే ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో వివరించాలని సూచించారు. జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి నాగరాజుశేఖర్, కోర్స్ డైరెక్టర్ జుంకీలాల్, జిల్లా రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో..

సమగ్రశిక్ష విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నూతనంగా చేరిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని డీఈఓ ఇ.సోమశేఖరశర్మ సూచించారు. 2019లో నిర్వహించిన పరీక్షలో మెరిట్ సాధించి ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు డీఆర్వో అశోకచక్రవర్తి పర్యవేక్షణలో అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు ఎస్.సతీష్‌కుమార్, సైదులు, నాగరాజశేఖర్, కార్యాలయ పర్యవేక్షకులు కె.జ్యోతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ జ్యోతి తెలిపారు. జిల్లాలో 11 బాలికలు, 11 బాలుర కళాశాలలు ఉండగా.. ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలురకు రఘునాథపాలెంలోని ఎస్ఎన్ మూర్తి పాలిటెక్నిక్ కళాశాలలో, బాలికలకు రఘునాథపాలెంలోని శారద ఇంజినీరింగ్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని, విద్యార్థులు హాల్‌టికెట్, మెరిట్ కార్డ్‌తో 28న ఉదయం 10 గంటల వరకు చేరుకోవాలని సూచించారు.

చెల్లెలిని హత్య చేసిన అన్న అరెస్టు

ఇల్లెందురూరల్: యువతిని రోకలిబండతో మోది హత్య చేసిన ఆమె అన్నయ్యను అరెస్టు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ వినియోగం విషయంలో తన చెల్లెలు సింధుతో చోటుచేసుకున్న ఘర్షణలో అన్న హరిలాల్ రోకలిబండతో మోదడంతో సింధు అపస్మారక స్థితిలోకి వెళ్లిందని, వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికి ఫలితం లేకుండా పోయిందని సీఐ చెప్పారు. విషయం బయటపడకుండా కింద పడటం వల్ల జరిగిన ఘటనగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పత్రికల ద్వారా విషయం తెలియడంతో విచారణ చేపట్టామని, తమ కుమారుడు హరిలాల్ కొట్టడం వల్లే సింధు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ ప్రారంభించామని తెలిపారు. పరారీలో ఉన్న హరిలాల్ బుధవారం పోలీసుల వద్ద లొంగిపోయి వాస్తవాన్ని అంగీకరించాడని వివరించారు. హరిలాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

వ్యాపారి కుమారుడు ఆత్మహత్య

ఇల్లెందు: ఇల్లెందుకు చెందిన ప్రముఖ వ్యాపారి కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంబజార్‌కు చెందిన వ్యాపారి కుమారుడు వివేక్ సాహూ (21) సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తొలుత బాత్‌రూంలో కాలుజారి పడగా మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. కానీ, కుటుంబీకులు అందజేసిన ఫిర్యాదు ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

దుప్పితోగు వాగులో యువకుడి గల్లంతు

కరకగూడెం: మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన యువకుడు దుప్పితోగు వాగులో పడి గల్లంతయ్యాడు. బంగారుగూడెంకు చెందిన పాడెం పాపారావు(22) తన ఆటోలో బుధవారం రాత్రి కిరాయికి పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డుకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో బంగారుగూడెం–గోవిందాపురం మధ్య దుప్పితోగు ఉధృతంగా బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్నా అలాగే రావడంతో ఆటోతో సహా పాపారావు కొట్టుకుపోయాడు. వెనక ఉన్న మరో ఆటోడ్రైవర్ విషయాన్ని పోలీసులు, గ్రామస్తులకు తెలపగా గాలింపు చర్యలు చేపట్టారు.

వాన ఆగట్లే.. వరద వదలట్లే..

కట్టగట్టుకుని మేఘాలన్నీ మూకుమ్మడిగా భూమిపై పడ్డట్లు.. ఆకాశానికి చిల్లులు పడి నీరంతా నేలపై ఒలకపోసినట్లు.. నాలుగు రోజులుగా విరామం ఎరుగకుండా వర్షపు ధారలు ముంచెత్తుతున్నాయి.. నదులు, వాగులు, వంకలు పరుగులు పెడుతూ ప్రజలను వణికిస్తున్నాయి.. ఊర్ల మధ్యలో నుంచి యేర్లు ఉరకలెత్తుతూ రాకపోకలను స్తంభింపజేస్తున్నాయి.. ఏవైపు తిరిగి చూసినా, అడుగు తీసి అడుగు వేసినా.. అడుగడుగునా నీరే కనిపిస్తోంది.. జడివాన దాటికి ప్రజలంతా ఇళ్లకే పరిమితమవగా లోతట్టు ప్రాంతాలు.. పొలాలు, చేనులు నీట మునిగాయి.. అత్యవసరం ఉన్న వారు, అధికారులు, ప్రజాసేవకులు తడిసి ముద్దవుతూనే ముందుకు సాగుతున్నారు.. ఇక గోదావరి ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరిక దాటి దూసుకుపోతోంది.. పెరుగుతూ తగ్గుతూ.. ముంపు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. – సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంలో కల్యాణకట్ట వద్ద గోదావరి వరద ఉధృతి



అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి అనుదీప్



పడమర మెట్ల వద్ద వర్షపు నీటితో మునిగిన విస్తా కాంప్లెక్స్ దుకాణాలు



నిత్యాన్నదాన సత్రంలోకి ప్రవేశించిన వర్షపు నీరు

24 గ్రామాలకు రాకపోకలు బంద్

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు పది గేట్లు ఎత్తడంతో రాజాపురం, యానంబైల్ చప్టా వద్ద బుధవారం వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎగువన ఉన్న 24 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బంజర లక్ష్మీదేవి చెరువు అలుగు పోయడం, మల్లారం రోడ్డులో లోలెవెల్ చప్టాపై, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య మట్టివర్రెవాగు పొంగిపార్లడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

'మూకమామిడి'కి మత్తడి..

ములకలపల్లి: మధ్యతరహా ప్రాజెక్ట్ మూకమామిడి జలకళ సంతరించుకుంది. పూర్తి నిల్వ నీటి సామర్థ్యం 29 అడుగులు నీరు చేరడంతో మత్తడి పోస్తోంది. బుధవారం కూడా ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. చాపరాలపల్లిలోని ఊరచెరువు, రామచంద్రాపురంలోని ఎదుళ్లవాగు చెరువు నిండి అలుగు పోస్తున్నాయి. ముత్యాలంపాడు శివారులోని లోలెవెల్ చప్టాలపై వరద పారతుండటంతో రాచన్నగూడెం గ్రామ పంచాయతీతోపాటు మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రవాహ ఉధృతిని పరిశీలించారు.

రాకపోకలకు అంతరాయం

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో ఆయా మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడుమెలికలవాగు, తొట్టివాగు, ఆళ్లపల్లి మండలంలో కిన్నెరసాని, జల్లేరు, ఈదుళ్లవాగులు ఉప్పొంగాయి. గుండాల – కొడవటంచ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొడవటంచ, పాలగూడెం, నాగారం, దొంగతోగు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కొత్తగూడెం – ఆళ్లపల్లి మధ్య కిన్నెరసాని మెట్లగూడెం మధ్య వంతెనపై వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.



పాల్వంచరూరల్: నర్సింహసాగర్ రోడ్డులో ప్రవహిస్తున్న వరద



ములకలపల్లి: అలుగు పోస్తున్న మూకమామిడి



చర్ల: లింగాపురం-లింగాపురంపాడు మధ్య రహదారిపై ప్రవహిస్తున్న వరద

పెదవాగు ప్రాజెక్టు గేటు ఎత్తివేత



అశ్వారావుపేటరూరల్: దిగువకు విడుదలవుతున్న నీరు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి బుధవారం వరద నీరు దిగువకు విడుదల చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన జోరు వర్షాలతో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని వాగుల నుంచి వరదనీరు పొటెత్తుతోంది. దాంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 21 అడుగులకు చేరగా, గేట్ల మరమ్మతుల తర్వాత తొలిసారిగా ప్రాజెక్టు గేటు–2ను మీటర్ ఎత్తి 2,749 క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించారు.

కూలిన ఇల్లు



ఇల్లెందు: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్‌బస్తీలో కాసాని హరిప్రసాద్ ఇల్లు వర్షాలకు బుధవారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో వారు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య బాధితులను పరామర్శించారు. పాయం స్వాతి, కల్తీ పద్మ, మండల రాము, పూనెం సురేందర్, కృష్ణప్రసాద్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మధారమ్మ, సన్నాయిల సరస్వతి తదితరులు ఉన్నారు.



చర్ల: కుదునూరు - ఆర్.కొత్తగూడెం రహదారిపైకి చేరిన వరదనీరు

ఉప్పొంగిన వాగులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం

చర్ల: భారీ వర్షం కారణంగా మండలంలోని కుదునూరు, దేవరాపల్లి, దండుపేట, లింగాపురం, లింగాపురంపాడు, దేవానగరం, ఆంజనేయపురం, సి.కత్తిగూడెం గ్రామాల సమీపంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లింగాపురం – లింగాపురంపాడు, కుదునూరు – ఆర్.కొత్తగూడెం, దండుపేట – కొత్తపల్లి, దేవానగరం – దోశిళ్లపల్లి, కలివేరుక్రాస్‌రోడ్ – ఆంజేయపురం గ్రామాల మధ్య వాగుల ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. ఉంజుపల్లి (వద్దిపేట) సమీపంలోని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంపులోకి తాలిపేరు వరద ఐదు అడుగుల మేర వచ్చింది. జవాన్లు లగేజీతో అతికష్టం మీద బయటకు చేరుకున్నారు. కలిపేరు 151 బెటాలియన్ క్యాంపు పరిధిలో పామేడు సమీపంలోని ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంపులోకి చింతవాగు వరద ఏడడుగులు వచ్చింది. జవాన్లు, అధికారులు క్యాంపును ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు.



చర్ల: వరద చేరడంతో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లో సామగ్రి సర్దుతున్న జవాన్లు

ఆరుగురిని కాపాడిన ఏఎస్‌ఐ ఘని

ఇల్లెందు/ఇల్లెందురూరల్: వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులను ఏఎస్ఐ ఘని.. డ్రైవర్‌తో కలిసి రక్షించాడు. బుధవారం నామాలపాడు వద్ద బయ్యారం పెద్దచెరువు అలుగువాగు ఉధృతిలో మహబూబాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. అకస్మాత్తుగా చెరువు అలుగు పెరగటంతో లోలెవెల్ కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న నీటి గుండా బస్సును దాటించే ప్రయత్నంలో మధ్యలో నిలిచిపోయింది. డ్రైవర్ నిజాంతో పాటు ఏడుగురు ప్రయాణికులున్నారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఘని కూడా అదే బస్సులో ఉన్నాడు. నీటి మధ్యలో బస్సు చిక్కుకుని స్టార్ట్ కాకపోవటంతో ఏఎస్ఐ ఘని చాకచక్యంగా ఆ ప్రయాణికులందరినీ ఒకరి చేతులు ఒకరు పట్టుకొమ్మని చెప్పి ఒడ్డుకు చేర్చాడు. డ్రైవర్ నిజాంతో పాటు ఏఎస్ఐ ఘని చూపిన చొరవతో ప్రయాణికులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవటంతో వారంతా వారికి కృతజ్ఞతలు తెలిపారు. బస్ మాత్రం నీటి ఉధృతిలోనే చిక్కుకుని ఉంది.



ప్రయాణికులను ఒడ్డుకు చేర్చిన ఏఎస్ఐ ఘని

కొత్తగూడెం సీసీఎస్‌కు ఆర్.బన్సీలాల్

కొత్తగూడెంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా సీఐల బదిలీల్లో భాగంగా సిరిసిల్ల జిల్లాలో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ఆర్.బన్సీలాల్‌ను కొత్తగూడెం సీసీఎస్‌కు కేటాయిస్తూ హైదరాబాద్ మల్టీజోన్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నాణ్యమైన విద్యాబోధన జరగాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన, నాణ్యమైన విద్యాబోధన జరగాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో విద్యా, మైనారిటీ, ఎస్సీ అభివృద్ధి, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ శాఖల పాఠశాలల్లో విద్యాబోధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా 368 పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 1 నుంచి 5 వరకు ఆంగ్ల మాధ్యమం అమల్లోకి వచ్చినందున ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆంగ్లంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడకుండా ద్విభాషా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో కనీస భాష, గణిత సామర్థ్యాలను పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 965 పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 38,110 మంది విద్యార్థులకు కనీస సామర్థ్యం పెంచేందుకు కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 72,548 మంది విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 47,698 మంది విద్యార్థులకు 2,90,205 నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు వివరించారు. విద్యార్థులలో పఠనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు 154 ప్రాథమిక పాఠశాలల్లో రీడింగ్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖర శర్మ, గురుకుల ఆర్‌సీఓ డేవిడ్‌రాజు, మైనారిటీ సంక్షేమాధికారి సంజీవరావు, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, బీసీ సంక్షేమాధికారి ఇందిర, బీసీ గురుకుల అధికారి జ్యోతి, ఎస్సీ గురుకుల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, మండల విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎంపీఓకు షోకాజ్ నోటీస్

చర్ల: మండల పంచాయతీ అధికారి బి.రామకృష్ణ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో గురువారం జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. భారీగా వర్షాలు కురుస్తుండగా స్థానికంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన ఎంపీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పాటు ప్రత్యేక అధికారి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ చర్లకు వచ్చిన సందర్భంలోనూ హెడ్‌క్వార్టర్‌లో లేకపోవడం, అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉండడంపై నోటీసు జారీ చేశారు. ఇందుకు రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వని పక్షంలో పంచాయితీ రాజ్ చట్టం–2018 ప్రకారం చర్యలు తీసుకుంటామని డీపీఓ నోటీసులో సూచించారు.

బీఆర్‌ఎస్‌లో అలజడి

- కొత్తగూడెం నుంచి పోటీకి గులాబీ నేతల క్యూ
- హైకోర్టు తీర్పుతో కంగుతిన్న ఆశావహులు
- డోలాయమానంలో డీహెచ్ గడల రాజకీయ భవిష్యత్
- తీర్పుపై చర్చోపచర్చల్లో వనమా వర్గం
- అభివృద్ధి పట్టాలపై గూడెం అంటున్న జలగం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ హైకోర్టు మంగళవారం వెలువరించిన తీర్పు జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. బీఆర్‌ఎస్ అధిష్టానం ఈ అంశంపై అచితూచి వ్యవహరిస్తోంది. హైకోర్టు తీర్పును సవాల్ చేసే ప్రయత్నాల్లో వనమా వర్గం ఉండగా, అదే తీర్పును అమల్లో పెట్టాలంటూ జలగం సంబంధిత అధికారులను కలుస్తున్నారు. మరోవైపు కొత్తగూడెం నుంచి కారు గుర్తుపై పోటీ చేయాలని గంపెడాశలు పెట్టుకున్న నేతల ఆశలపై హైకోర్టు తీర్పు నీళ్లు చల్లినట్లయింది.

తారుమారు

గత ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన జలగం వెంకట్రావు ఓటమి పాలవ్వగా వనమా కాంగ్రెస్ నుంచి గెలిచారు. అయితే అందరి అంచనాలను తారుమారు చేస్తూ వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో ఇద్దరు నేతలు ఉండగా, మూడో వ్యక్తికి ఇక్కడ అవకాశం దొరకడం దుర్లభం అనే పరిస్థితి ఉండేది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జలగం వెంకట్రావు నియోజకవర్గంలో పెద్దగా హడావుడి చేసింది లేదు. అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు. మరోవైపు వనమా రాఘవపై పోలీస్ కేసులు నమోదు కావడంతో సీన్ మారిపోయింది.

హడావుడి చేస్తున్న గడల

జలగం పెద్దగా నియోజకవర్గానికి రాకపోవడం, మరోవైపు వనమా కుటుంబంపై కేసులు – వయోభారాన్ని సాకుగా చూపుతూ కొత్తగూడెం సీటు నుంచి పోటీ చేసేందుకు చాలా మంది ఉత్సాహం చూపించారు. వీరందరినీ వెనక్కి నెడుతూ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ముందు వరుసలోకి వచ్చారు. జీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాల పేరుతో రాజకీయ ప్రణాళికను అమల్లో పెట్టారు. సెలవు చిక్కితే చాలు కొత్తగూడెంలో వాలిపోతూ సిట్టింగ్ ఎమ్మెల్యే వనమాపై విమర్శలు చేస్తూనే మరోవైపు సీఎం కేసీఆర్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తూ వచ్చారు. కేవలం ఏడాది వ్యవధిలోనే గడల పేరు అందరి నోళ్లలో నానే స్థాయికి చేరుకున్నారు.

కొద్దిరోజులుగా వద్దిరాజు..

పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉంటారని, ఆయనకు సమర్థంగా ఎదుర్కొనే అభ్యర్థి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అంటూ కొంతకాలంగా కొత్త ప్రచారం ఊపందుకుంది. దీంతో కొత్తగూడెం నుంచి కారులో ఎవరికి బెర్త్ దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా హైకోర్టు తీర్పుతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఊహించని విధంగా జలగం వెంకట్రావు తెరమీదకు వచ్చారు. నిన్నా మొన్నటి వరకు గులాబీ పార్టీ నుంచి జలగం బరిలో ఉంటారా లేదా అనే స్థాయి నుంచి ఆయనే ఉంటారనే పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగూడెం టికెట్‌పై ఆశలు పెట్టుకున్న నేతలకు ఈ తీర్పు పిడుగుపాటులా మారిందనే అభిప్రాయం నియోజవర్గంలో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గడల శ్రీనివాసరావు భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉంటుందనే చర్చ మొదలైంది.

అధిష్టానం ఆరా

కొత్తగూడెం నియోజవర్గంలో పార్టీ పరిస్థితులపై ఎప్పటికప్పుడు బీఆర్‌ఎస్ అధిష్టానం ఆరా తీస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఇక్కడ అనుసరించాల్సిన వ్యూహంపై ఇప్పటికే చర్చ మొదలైంది. హైకోర్టు ఇచ్చిన తీర్పుతో నష్టపోయిన, లాభపడిన ఇద్దరు వ్యక్తులు బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారే కావడంతో పరిస్థితి సున్నితంగా మారింది. దీంతో పార్టీ తరఫున హడావుడిగా ప్రకటనలు చేయకుండా అన్ని అంశాలను నిశితంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అందువల్లే కోర్టు తీర్పు పట్ల జలగం, వనమా వర్గీలు తప్పితే పార్టీ పరంగా మిగిలినవారేవరు ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు తీర్పు వెలువడిన తర్వాత ప్రగతి భవన్ నుంచి వనమాకు ఫోన్ వెళ్లినట్టు సమాచారం. రాజకీయాల్లో లాంటి పరిణామాలు సహజమేనని అన్నింటిని తట్టుకుని ముందుకు వెళ్లాలని సీఎం కేసీఆర్ వనమాకు సూచించినట్టు తెలుస్తోంది. గడ్డుకాలంలో వనమాకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్టు వనమా వర్గం నేతలు చెబుతున్నారు.

ప్రజల నుంచి వేరు చేయలేరు



ఎన్ని అవాంతరాలు ఎదురైనా కొత్తగూడెం ప్రజల నుంచి తనను ఎవరూ వేరు చేయలేరు. వార్డు సభ్యుని నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన నాకు అధికారం, పదవులు కొత్త కాదు. గెలిచినపుడు ప్రజలతో ఉంటూ, ఓడినప్పుడు ప్రజలకు దూరంగా ఉండటం అనేది వారికి ద్రోహం చేసినట్టే. రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు పార్టీ పటిష్టతకు కూడా పాటు పడుతున్నాను. నియోజకవర్గంలో 80 శాతం మంది ప్రజాప్రతినిధులను గెలిపించుకున్నాను. మున్నూరుకాపు, బీసీ వర్గానికి చెందిన నాపై కుట్రలు చేశారు. చివరి శ్వాస వరకు కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తాను.

–వనమా వెంకటేశ్వరావు

చర్యలు మొదలయ్యాయి



కొత్తగూడెం ఎమ్మెల్యేగా 2018, డిసెంబరు 12 నుంచి నన్ను గుర్తించాలని ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీటికి సంబంధించిన తీర్పు కాపీలను ఈ రోజు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు అందించాను. అసెంబ్లీ స్పీకర్‌కు, సెక్రటరీలకు కూడా ఇచ్చాను. హైకోర్టు తీర్పును అనుసరించి తీసుకోవాల్సిన విధానపరమైన చర్యలు మొదలయ్యాయి. తుది అంకానికి చేరడానికి కొంత సమయం పట్టవచ్చు. నాలుగేళ్లుగా కొత్తగూడెంలో ఆగిపోయిన అభివృద్ధిని పట్టాలెక్కిస్తాను. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రారంభించిన పనులే పూర్తి చేయలేకపోయారు. సమయం ఎంతుందన్నది కాదు, సంకల్పం ఎంత బలమైంది అనేది ముఖ్యం.

– జలగం వెంకట్రావు

అగ్నిప్రమాదంలో 16 మేకలు మృతి



మృతిచెందిన మేకలు

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామంలో భారీ వర్షాలకు పూనెం రమేశ్‌కు చెందిన ఇల్లు బుధ వారం పూర్తిగా నేలమట్టమైంది. ఈ క్రమంలో మంటలు చెలరేగి పక్కనే ఉన్న మేకల షెడ్డుకు అంటుకోగా స్థానికులు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండాపోయింది. అందులో ఉన్న 16 మేకలు మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు.

క్లుప్తంగా...

ఐఎంఏ సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డా.కిరణ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ కిరణ్ మాదల నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ డీసీ తిరుపతిరావు, కో చైర్మన్‌గా డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ, సభ్యులుగా డాక్టర్లు శశికళారెడ్డి, రామనర్సింహారెడ్డి, ఎంఎస్ఎస్ ముఖర్జీ, టి.సుబ్రమణ్యేశ్వరరావు, పి.దత్తాత్రేయ, పవన్‌కుమార్, చిన్మయి రాత, ఎంవీ రావు, శ్రీభూషణ్ రాజు ఉన్నారు.

5 నుంచి రాష్ట్ర పీజీ మెడికల్ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 5వ తేదీ నుంచి మొదటి విడత రాష్ట్రస్థాయి కోటా మెడికల్ పీజీ (ఎండీ, ఎంఎస్, డిప్లొమా, ఎండీఎస్, పీజీ డీఎన్‌బీ) సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఆగస్టు 16 వరకు కౌన్సెలింగ్ జరుగనుంది. ఇందులో సీట్లు పొందినవారు 20, 21 తేదీల్లో చేరాలి. ఇక రెండో విడత కౌన్సెలింగ్ వచ్చే నెల 25 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించనున్నారు. వాటిల్లో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో చేరాలి. ఇక మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 16 నుంచి 26వ వరకు జరగనుంది. అందులో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ మధ్య చేరాలి. స్ట్రే వేకెన్సీ (తుది విడత) కౌన్సెలింగ్ అక్టోబర్ 1 నుంచి పదో తేదీ వరకు జరుగుతుంది. అందులో సీట్లు పొందినవారు పదో తేదీనే చేరాల్సి ఉంటుంది. తరగతులు సెప్టెంబర్ 5 నుంచే జరుగుతాయని ఎన్ఎంసీ తెలిపింది.

ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2023-24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓయూ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ. పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు osmania.ac.inలోచూడవచ్చని వివరించారు.

ఏఎన్ఎం పోస్టులు 1520

భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఏఎన్ఎం (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్-ఫిమేల్) పోస్టుల భర్తీకి ప్రకటన జారీ అయ్యింది. మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్యకార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు సమర్పించాలి. రాతపరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది. పేస్కేల్ రూ. 31,040 నుంచి రూ.92,050 మధ్య ఉంటుంది. బహుళ ఐచ్ఛిక ఎంపిక విధానంలో రాతపరీక్ష ప్రాతిపదికన ఓఎంఆర్ లేదా కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే ఈ రెండు పద్ధతుల్లో ఏ విధంగా పరీక్ష నిర్వహిస్తారన్న దానిపై త్వరలో వెల్లడిస్తామని గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు రుసుము రూ. 500, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్ తదితర కేటగిరీలకు మినహాయింపు ఉంటుంది.

మొత్తం పోస్టులు: 1520 (ఫిమేల్)
దరఖాస్తులు స్వీకరణ: వచ్చేనెల 25న ఉదయం 10:30 నుంచి
దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం 5:30 వరకు
పరీక్ష కేంద్రాలు : హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్

ఇవీ అర్హతలు:

- అభ్యర్థులు తప్పనిసరిగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) ట్రెనింగ్ కోర్సు చేసి ఉండాలి. లేదా ఇంటర్‌లో మల్టీపర్పస్ హెల్త్ వర్క ర్ (ఫిమేల్) శిక్షణ కోర్సు పాసై ఉండాలి.
- తెలంగాణ రాష్ట్ర నర్సెస్ అండ్ మిడ్ వైవ్స్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి.
- నిర్ధారించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాదిపాటు క్లినికల్ ట్రెనింగ్ చేసి ఉండాలి. లేదా గుర్తించిన ఆస్పత్రుల్లో ఏడాది అప్రెంటిషిప్ పూర్తి చేసి ఉండాలి. వారు తెలంగాణ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. ఎవరైనా అభ్యర్థి ఈ అర్హతలకు సమానమైన ఇతర అర్హతలను కలిగి ఉంటే, ఆ విషయాన్ని బోర్డు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి రిఫర్ చేస్తారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది.
- దరఖాస్తుదారులు 18 - 44 ఏళ్ల మధ్యలో ఉండాలి. వివిధ వర్గాలకు సంబంధించి వారికి ప్రభుత్వం నిర్ణయించిన వయోపరిమితి సడలింపులు వర్తిస్తాయి.



- పరీక్షలో మార్కులకు గరిష్ఠంగా 80 పాయింట్లు ఉంటాయి. వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన/చేస్తున్న వారికి గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు.
- గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించినవారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ అనుభవమున్నవారు ధ్రువీకరణపత్రాన్ని పొందిన తర్వాత ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ఏ సేవలు అందించి ఉంటే, ఆ కేటగిరీ పోస్టులకు మాత్రమే పాయింట్లు వర్తింపజేస్తారు.

అప్‌లోడ్ చేయాల్సినవి :

అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేయడంతోపాటు అవసరమైన పత్రాల సాఫ్ట్ కాపీ (పీడీఎఫ్)లను అప్‌లోడ్ చేయాలి. ఆధార్ కార్డ్, పదోతరగతి సర్టిఫికెట్, అర్హత సాధించిన కోర్సులకు చెందిన సర్టిఫికెట్లు ఉండాలి. అనుభవ ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), స్థానికత గుర్తింపు కోసం 1 నుంచి 7వ తరగతి వరకు చదివిన సర్టిఫికెట్లు లేదా నివాస ధ్రువీకరణపత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే కులధ్రువీకరణ పత్రం, బీసీల విషయంలో తాజా నాన్-క్రీమీలేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోరేవారు తాజా ఆదాయం, ఆస్తి సర్టిఫికెట్, స్పోర్ట్స్ సర్టిఫికెట్, సదరం నుంచి దివ్యాంగ సర్టిఫికెట్, ఎన్‌సీసీ ధ్రువీకరణపత్రం వంటివి అవసరాన్ని బట్టి జత చేయాల్సి ఉంటుంది.

జోన్లవారీగా స్థానికులకు 95 శాతం రిజర్వేషన్

ఏఎన్ఎం పోస్టులను జోన్లవారీగా భర్తీ చేస్తారు. ఆయా జోన్ల అభ్యర్థులకే 95% పోస్టులు కేటాయిస్తారు. మిగతావి ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తారు.

- జోన్-1 (కాళేశ్వరం)లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి,ములుగు జిల్లాలు.
- జోన్-2 (బాసర)లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల
- జోన్-3 (రాజన్న)లో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి
- జోన్-4 (భద్రాద్రి)లో కొత్తగూడెం, ఖమ్మం , మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్
- జోన్-5(యాదాద్రి)లో సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగాం
- జోన్-6(చార్మినార్)లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్
- జోన్-7(జోగులాంబ)లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ-గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలున్నాయి.

వివిధ జోన్లు, కేటగిరీల వారీగా పోస్టుల వివరాల పట్టిక...

కేటగిరీ	జోన్-1	జోన్-2	జోన్-3	జోన్-4	జోన్-5	జోన్-6	జోన్-7	మొత్తం
ఓసీ	49	68	78	72	71	56	57	451
ఈడబ్ల్యూఎస్	18	23	27	24	25	19	21	157
బీసీ-ఏ	14	16	20	17	19	14	13	113
బీసీ-బీ	15	21	25	23	23	18	21	146
బీసీ-సీ	2	3	2	3	2	2	1	15
బీసీ-డీ	12	15	19	16	16	14	13	105
బీసీ-ఈ	7	9	11	9	10	8	7	61
ఎస్సీ	25	33	38	35	35	27	29	222
ఎస్టీ	17	23	27	24	25	20	21	157
స్పోర్ట్స్	3	4	5	4	5	3	4	28
ఓహెచ్	7	10	11	10	10	8	9	65
మొత్తం	169	225	263	237	241	189	196	1520

ఓహెచ్: ఆర్థోపెడిక్ హ్యాండిక్యాప్

'పల్లెవెలుగు'లో మరో రాయితీ టికెట్

30 కి.మీ. పరిధిలో రూ.50కే రానుపోను సదుపాయం

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల్లో వెళ్లే ప్రయాణికులను బస్సుల వైపు మళ్లించేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్తగా పల్లె వెలుగు బస్సుల్లో 30 కి.మీ. దూరం ప్రయాణించే వారికి రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కొద్ది రోజుల క్రితం సంస్థ టీ9-60 పేరుతో పల్లెవెలుగు బస్సుల్లో 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికులకు రూ.100కే రానుపోను రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దానికి స్పందన తక్కువగా ఉండటంతో, ఇప్పుడు టీ9-30 పేరుతో 30 కి.మీ. పరిధిలో తిరిగే వారికి రూ.50కే రానుపోను వర్తించేలా రాయితీ టికెట్‌ను ప్రారంభించింది. ఈ టికెట్లు గురువారం నుంచి కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

ఆటోల్లో ప్రయాణించేవారిపై గురి..

చాలా ప్రాంతాల్లో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పల్లెవెలుగు బస్సు టికెట్‌పై రాయితీ ప్రకటిస్తే వారిలో కొందరైనా బస్సులెక్కు తారని ఆర్టీసీ భావిస్తోంది. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సుల్లో 30 కి.మీ. నిడివిలో ప్రయాణించే వారి సంఖ్య దాదాపు మూడున్నర లక్షలుగా ఉంది. అంతకు రెట్టింపు జనం అదే పరిధిలో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా తెచ్చిన రాయితీ టికెట్ తీసుకుంటే.. రూ.50తో గమ్యం వెళ్లితిరిగి రావచ్చు. దానికి అదనంగా రూ.20 చెల్లించి కాంబి టికెట్ తీసుకుంటే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అదే టికెట్‌తో రాను, పోనూ ప్రయాణించవచ్చు. కొద్ది రోజుల క్రితం 60 కి.మీ. నిడివిలో ప్రయాణించేవారికోసం రూ.100కే రానుపోను టికెట్ తీసుకురాగా, 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో దానికి పెద్దగా స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో చాలా మంది డిపో మేనేజర్లు కోరటంతో కొత్త విధానం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ఈ టికెట్ చెల్లుబాటులో ఉంటుంది. సాయంత్రం 6 వరకు టికెట్ల జారీ ఉంటుంది. 30 కి.మీ. పరిధిలో పొరుగు రాష్ట్రంలో ప్రయాణం ఉంటే.. అక్కడ కూడా ఇది చెల్లుబాటు (టీఎస్ఆర్టీసీ బస్సుల్లోనే) అవుతుందని అధికారులు ప్రకటించారు. ఈ కొత్త టికెట్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎండీ సజ్జనార్‌లు ఆవిష్కరించారు.

ఎంబీబీఎస్ అర్హుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హుల జాబితాను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను విడుదల చేసినట్లు కాళోజీ వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 22,167 మంది అర్హత సాధించారని వర్సిటీ తెలిపింది. అర్హత జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 29న సాయంత్రం 4 గంటల్లోపు knrugadmission @gmail. comకు తెలి యజేయాలని సూచించింది. కాగా, వెబ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ అనంతరం వీరు తమకు ఇష్టమైన కాలేజీలను ఎంపిక చేసుకోవచ్చని, వారికి వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు వెల్లడించింది.

'ఓఆర్ఆర్ లీజు' సమాచారం ఇవ్వడం లేదు

- గత నెల 14న దరఖాస్తు చేసినా అధికారులు స్పందించడంలేదు
- హైకోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిటిషన్



సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ నిర్వహణ బదిలీ (టీవోటీ)కి సంబంధించిన సమాచారాన్ని, సమాచార హక్కు చట్ట ప్రకారం కోరినా అధికారులు ఇవ్వడం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 14న దరఖాస్తు చేసినా ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారుల తీరు ఆర్టీఐ చట్టంతో పాటు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను కూడా ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. తాను మే 1న తొలిసారి దరఖాస్తు చేయగా, మే 23న అరకొర సమాచారం మాత్రమే ఇచ్చారని వివరించారు. దీంతో జూన్ 14న మరోసారి దరఖాస్తు చేశానన్నారు. ఓఆర్ఆర్ లీజు నివేదికలు, 30 ఏళ్లకు ఇవ్వడంపై మంత్రిమండలి నిర్ణయం, 2021-22, 2022-23 సంవత్సరాలలో ఆర్జించిన మొత్తం ఆదాయానికి సంబంధించి సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. లీజు పారదర్శకంగా జరిగిందా? లేదా? తెలుసుకోవడానికి ఈ సమాచారం కీలకం అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రజా సంబంధాల అధికారి, ఎండీ(ఎఫ్ఏసీ)లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆర్‌టీఐ చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇచ్చేలా ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్ నేడు లేదా రేపు విచారణకు రానుంది. ఓఆర్ఆర్ నిర్వహణ, టోలు వసూలు బాధ్యతలను 30 ఏళ్ల పాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

జిల్లా వార్తలు

స్వీయ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ

ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశమున్నందున.. ప్రతిఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తడి చేతులతో ఇంట్లో విద్యుత్ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దని, బట్టలు ఆరేసే దండాలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలని తెలిపారు. సమస్యలు ఎదురైతే నిపుణులతోనే మరమ్మతు చేయించాలని, సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడొద్దని సూచించారు. స్తంభం నుంచి ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్లు రేకుల పందిర్లకు తాకకుండా చూడాలని, ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే రక్షించాలనే ఆతృతలో ముట్టుకోకుండా.. కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో ఆ వ్యక్తిని వేరు చేయాలని తెలిపారు. పొలాల వద్ద రైతులు స్టార్టర్ల డబ్బాలు నీటిలో తడవకుండా కాపాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లొద్దని చెప్పారు. వర్షాలు కురుస్తున్న సమయాన పిడుగులు పడే అవకాశమున్నందున చెట్ల కింద ఉండొద్దని సీఎండీ సూచించారు.

ఫిర్యాదులు ఉంటే..

విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు తెలియజేయడానికిప్రత్యేక నంబర్లు కేటాయించినట్లు సీఎండీ గోపాల్‌రావు వెల్లడించారు. 1800 425 0028 లేదా 1912 నంబర్లతో పాటు ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయం కంట్రోల్ రూం నెంబర్ 94408 11525కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

శైవాగమ పండితుడు కృష్ణశర్మకు సన్మానం



కృష్ణశర్మను సన్మానిస్తున్న పీఠాధిపతి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, శైవాగమ పండితులు దాములూరి కృష్ణశర్మను అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చితానందస్వామి, విజయానంద తీర్థస్వామి సన్మానించారు. హైదరాబాద్ లోని దత్తపీఠం శ్రీ గణపతి సచ్చితానందం ఆశ్రమంలో మంగళవారం జరిగిన సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి పండితులను ఆహ్వానించి సత్కరించారు. ఇందులో ఖమ్మం నుంచి కృష్ణశర్మ కూడా ఉన్నారు.

సింగరేణి వ్యాప్తంగా నిలిచిన బొగ్గు ఉత్పత్తి

బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీతకు విఘాతం

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా సింగరేణిలో సుమారు 5.69 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ తొమ్మిది రోజుల్లో 13,74,944 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 8,05,056 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే నమోదైంది. అలాగే, 111.8 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీకి గాను 12.29 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ(10.99శాతం) వెలికి తీయగలిగారు. ఇక భూగర్భ గనుల్లో 1,91,604 లక్షల టన్నుల బొగ్గుకు గాను 1,13,811 లక్షల టన్నుల (59 శాతం) బొగ్గు ఉత్పత్తి జరిగింది. వర్షాలతో సింగరేణివ్యాప్తంగా 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీగా వర్షం నీరు చేరగా హాల్‌రోడ్లన్నీ బురదమయ్యాయి. దీంతో ఉత్పత్తి పడిపోయి సీహెచ్‌పీలన్నీ వెలవెలబోతున్నాయి. క్వారీల్లో డంపర్లు, డోజర్లు ఎక్కడికక్కడే నిలిచిపోగా, వర్షపు నీటిని ప్లాన్‌టూన్ పంపుల ద్వారా తొలగిస్తున్నారు.



సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో నిలిచిన వర్షపు నీరు

రక్షణ చర్యలు చేపట్టాకే ఉత్పత్తిపై దృష్టి

- డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్
- ఇల్లెందులో త్రైపాక్షిక భద్రతా సమావేశం

ఇల్లెందు: సింగరేణిలో ఉత్పత్తి కీలకమే అయినా.. తొలుత కార్మికుల రక్షణ చర్యలు చేపట్టాకే ఉత్పత్తిపై దృష్టి సారించాలని డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ సూచించారు. సింగరేణి సంస్థ పరిధిలోని ఇల్లెందు ఏరియాలో 16వ త్రైపాక్షిక భద్రతా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూషణ్‌ప్రసాద్‌తో పాటు సింగరేణి డైరెక్టర్ (పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత రక్షణ ప్రతిజ్ఞ చేశాక గని ప్రమాదాల్లో మృతి చెందిన ఉద్యోగుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం 15వ త్రైపాక్షిక భద్రత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీవైజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ మాట్లాడుతూ సమవేశాల దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య, పరిష్కారంపై చర్చించాల్సి ఉందన్నారు. ఇల్లెందు ఏరియా ప్రమాద రహితంగా ఉండడంపై అభినందించారు. సమావేశంలో అధికారులు ఉమేశ్, ఎం.సవర్కర్, ఎస్.ఆనంద్‌వాల్, ఎస్‌జీ బైసారే, డాక్టర్ జార్జ్‌జాన్, కమలేశ్‌కుమార్ వర్మ, సనత్‌కుమార్, దిలీప్‌కుమార్, రాజీవ్ ఓంప్రకాష్, గౌరవ్ లడ్డా, కె.గురువయ్య, కుమార స్వామి, జాన్ ఆనంద్, యూనియన్ ప్రతినిధులు ఎస్.రంగనాథ్, కె.సారయ్య, లింగాల జగన్నాథం, సిరాజ్ అహ్మద్, సైదులు, శుక్లాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్

సింగరేణిలో 14 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 14 మంది అధికారులను బుధవారం బదిలీ చేశారు. కార్పొరేట్ ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను బెల్లంపెల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా, ఒడిశాలోని నైనీ జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్‌ను కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎంగా, బెల్లంపెల్లి ఏరియా జీఎం గాజర్ల దేవేందర్‌ను మార్కెటింగ్ మేనేజర్ జీఎంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ఈ అండ్ ఎం విభాగంలో 9 మంది అధికారులను కూడా బదిలీ చేయగా, వారిలో నలుగురు జీఎంలు, ఐదుగురు డీజీఎంలు ఉన్నారు. ఇంకా పర్సనల్ విభాగంలో ఒక డీజీఎం, ఒక సీనియర్ పీఓను సైతం బదిలీ చేశారు.

ఈఎస్ఐ అసిస్టెంట్ కమిషనర్‌గా సింగరేణి అధికారి

మురళీధర్‌కు మూడేళ్ల పాటు డిప్యూటేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఎస్ ఓటూ డైరెక్టర్ పా(పర్సనల్)గా విధులు నిర్వర్తిస్తున్న అడపాల మురళీధర్‌రావు హరియాణా రాష్ట్రంలోని ఫరిదాబాద్‌లో ఉన్న ఈఎస్ఐ విభాగానికి అసిస్టెంట్ కమిషనర్, రీజియన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనను బుధవారం రిలీవ్ చేశారు. సింగరేణిలో వెల్ఫేర్ ఆఫీసర్‌గా 1996లో బాధ్యతలు చేపట్టిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఇటీవల చేపట్టిన నియామకాల్లో ప్రతిభ చాటిన మురళీధర్ ఈఎస్ఐ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. కాగా, డిప్యూటేషన్‌పై వెళ్తున్న మురళీధర్‌ను సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బసవయ్య, హన్మంతరావు, వెంకటేశ్వరరావు, కవితానాయుడు, ధన్‌పాల్ శ్రీనివాస్, సునీల, ఆనంద్ సుధాకర్, రాహుల్ పాల్గొన్నారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ఈ పోస్టుకు ఎంపికయ్యానని తెలిపారు. తన తల్లిదండ్రులు సీఎంపీఎఫ్ (సింగరేణి మైన్స్ ప్రావిడెంట్ ఫండ్)లో చిరుద్యోగులుగా పనిచేస్తూ తనను చదివించారని చెప్పారు.



మురళీధర్‌రావును సన్మానిస్తున్న డైరెక్టర్ బలరామ్, అధికారులు

ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగమే కీలకం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం పాత్ర కీలకమని డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ పరిధిలోని 11 ఏరియాల సెక్యూరిటీ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలను అరికట్టేందుకు నిరంతరం గాలింపు చేపట్టాలని, కంపెనీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిశీలించాలని సూచించారు. అలాగే, కంపెనీ క్వార్టర్ల ఆక్రమణ జరగకుండా చూడాలని చెప్పారు. ఇదే సమయాన సిబ్బంది సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో సెక్యూరిటీ జీఎం దీక్షితులు, చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజు, ఎస్ఓటూ జీఎం వేణుమాధవ్, కార్పొరేట్ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎండీ జాకీర్ హుస్సేన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్

జైపూర్‌లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న సింగరేణి ఉద్యోగ సంఘం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 24 నుంచి ఢిల్లీకి చెందిన ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యాన జరుగుతున్న వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. 'ఇంప్లిమెంటేషన్ రిజర్వేషన్ పాలసీ ఆన్ ఎస్సీ, ఎస్టీ'అంశంపై జరిగిన ఈ వర్క్‌షాప్‌లో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నుంచి సెంట్రల్ కమిటీ సభ్యులు, 11 ఏరియాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలుపై ఆరు నెలలకోసారి శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉన్నా కరోనా కారణంగా జరగడం లేదన్నారు. మళ్లీ ఇప్పుడు తరగతులు ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా రిజర్వేషన్ల అమలు, ఇతర అంశాలపై అకాడమీ బాధ్యులు అవగాహన కల్పించాలని తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.1.70కోట్లు



చిత్రకూట మండపంలో ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 63 రోజులకు గాను రూ.1,70,49,637 ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ రమాదేవి, దేవాదాయ శాఖ అధికారుల సమక్షాన హుండీలను చిత్రకూట మండపానికి తరలించి లెక్కించారు. ఈమేరకు రూ.1,70,49,637 నగదు, 400 గ్రాముల బంగారం, 1.700 కేజీల వెండితో పాటు యూఎస్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల కరెన్సీ లభించిందని ఈఓ రమాదేవి వెల్లడించారు. ఆలయంలో ప్రవేశపెట్టిన నూతన పూజలతో పాటుగా వారాంతపు, సెలవు దినాల్లో భక్తుల రద్దీ కారణంగా ఆదాయం కూడా పెరిగిందని తలిపారు.